సాక్షి నంద్యాల

సోమవారం ၊ 24 ၊ జూన్ ၊ 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన టీఆర్ఎం శర్మ రూ.2,00,016 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్యకళావేదికపై నందికొట్కూరుకు చెందిన శ్రీ సాయి నృత్య కళాశాల వారి నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

నేడు వినతుల స్వీకరణ

బొమ్మలసత్రం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వినతులు స్వీకరిస్తున్నట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను పోలీసులకు దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ, డీఎస్పీ కార్యాలయాల్లో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మల్లన్నసేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జి.ప్రియదర్శిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆశీర్వచన మండపంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

డ్వామా టీఏ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సుబ్బన్న

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా డ్వామా టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్బన్న ఎన్నికయ్యారు. ఆదివారం నంద్యాల మండలం పాండురంగాపురం సీఎల్ఆర్సీ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశంలో అధ్యక్షులుగా సుబ్బన్న, ఉపాధ్యక్షుడిగా షబ్బీర్, కార్యదర్శిగా కొర్నెల్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సుబ్బరాయుడు, సలావుద్దీన్‌ల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బన్న మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్షావలి, హుసేనయ్య, మద్దిలేటి, ఇర్ఫాన్‌వలి, ప్రసాద్, సురేఖ, నాగలక్ష్మి, వినీలా గ్రేష్ పాల్గొన్నారు.

ముగిసిన న్యాయమూర్తుల అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులో న్యాయమూర్తుల అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు నేతృత్వంలో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులకు భారతీయ న్యాయ సంహిత 2003, భారతీయ నాగరిక్ అదినీయం 2023 అమలు కోసం కొత్త చట్టాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి న్యాయమూర్తులు భూపాల్‌రెడ్డి, ప్రతిభాదేవి, పాండురంగారెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

బడిలో బిజినెస్



- ప్రైవేటు స్కూళ్లలో అంతులేని దోపిడీ
- అడ్మిషన్ కావాలంటే అన్నీ కొనాల్సిందే
- బుక్స్, యూనిఫాం, షూస్ అధిక ధరకు విక్రయం
- ఏటా 20 నుంచి 30 శాతం పైగా స్కూల్ ఫీజు పెంపు
- విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని భారం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

☛ ఆళ్లగడ్డలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రెండవ తరగతి విద్యార్థికి 8 పాఠ్యపుస్తకాలు ఇచ్చారు. అవేమి వందల పేజీలు ఉండే భారీ పుస్తకాలు కాదు. కేవలం 30 నుంచి 60 పేజీలున్న సాధారణ పుస్తకాలే. వాటి వెల రూ. 3,200. అంటే పుస్తకం ఖరీదు రూ.400. అదే బాలుడికి ఇచ్చిన 24 నోట్ పుస్తకాల ధర రూ. 2,600. ఇంకా కంప్యూటర్, జీకె, ఇతర పుస్తకాలు అదనం.. అన్నీ కలిపి పుస్తకాల ఫీజు రూ.9 వేలు కట్టించుకున్నారు.

☛ జిల్లా కేంద్రం నంద్యాలలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో విద్యార్థులకు బుక్స్, బ్యాగు, చివరికి షూ సైతం తమ దగ్గరే తీసుకోవాలనేది అక్కడి యాజమాన్యం ఆదేశాలు. ఒక్కో విద్యార్థికి బుక్స్ ఇతర మెటీరియల్ కలిపి రూ.15 వేల నుంచి రూ.20 వేలు దాటుతున్నాయి. వాటి ధర మార్కెట్లో రూ.8 వేల లోపే ఉంటుంది. ఇదేమని అడిగితే.. అవి తీసుకుంటేనే ఇక్కడ అడ్మిషన్. లేదని బయటి బుక్స్ తెస్తే నో పర్మిషన్. ఇక్కడే కాదు జిల్లాలో దాదాపు అన్ని ప్రైవేట్ స్కూళ్లలో ఇదే పరిస్థితి.



ఆళ్లగడ్డలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విక్రయానికి ఉంచిన పుస్తకాలు

ఆళ్లగడ్డ/నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఏటా పెంచే బడి ఫీజు, బడి బస్సు చార్జీలతో పాటు పుస్తకాలు, ట్యూషన్, టై, బెల్టు, బ్యాడ్జీ, యూనిఫాం తమ వద్దే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి. ప్రతి కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలది ఇదే తంతు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలల సంఖ్య సుమారు 1,472 కాగా.. వీటిలో 950 దాక ప్రాథమిక పాఠశాలలే. వాటిల్లో 1,50,158 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి పాఠశాలలో సైడ్ బిజినెస్ కొనసాగుతోంది. ఓ వైపు భారీ ఫీజుతో దోచుకుంటున్నా ప్రైవేటు విద్యాసంస్థల ధనదాహం తీరడం లేదు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వస్తువులను విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాయి. విద్యార్థులకు అవసరమైన అన్ని వస్తువులు తమ పాఠశాలలోనే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేసి అంటగడుతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి మండల, గ్రామ స్థాయిల్లోని ఏ ప్రైవేటు పాఠశాల అయినా పిల్లలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, దుస్తులు, టైలు, షూలు, బెల్టులు, పెన్సిళ్లు, పెన్నులు, చివరకు పలకా బలపం కూడా అక్కడే కొనుగోలు చేయాలని తెగేసి చెబుతున్నాయి. ఫీజు కట్టే సమయంలోనే వస్తు, సామగ్రికి సంబంధించిన మొత్తాన్ని కూడా కలిపి వసూలు చేస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో తినుబండారాలు కూడా అక్కడే విక్రయించేలా దుకాణాలు ఏర్పాటు చేయడం విశేషం.

ఫీజుల నియంత్రణ గాలికి..

విద్యాహక్కు చట్టం జీవో నెంబరు 42ను అనుసరించి ప్రభుత్వం నిర్దేశాలను జారీ చేసింది. ఈ జీవోను అనుసరించి ఆయా ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల ముందు ఏ తరగతికి ఎంత ఫీజు వివరాల నోటీసు బోర్డులో ఉంచాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాల్సి ఉంటుంది. ఒక వేళ ప్రభుత్వం ఇచ్చిన జీవో కంటే ఫీజులు అధికంగా వసూలు చేయాల్సి వస్తే జిల్లా ఫీజుల క్రమబద్ధీకరణ కమిటీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఈ కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా డీఈఓ కన్వీనర్‌గా, జిల్లా ఆడిట్ అధికారి, ఆర్డీవో, డీవైఈవోలు సభ్యులుగా ఉంటారు. డీఏఫ్ఆర్సీ అనుమతి లేకుండా ఎక్కువ రుసుం వసూలు చేస్తే విద్యాహక్కు చట్టం ప్రకారం శిక్ష తప్పదు.

అనుమతులు ఏవీ..

పాఠ్యపుస్తకాలతోపాటు ఇతర వస్తువులు విక్రయించాలంటే అధికారుల అనుమతి తప్పనిసరి. పట్టణాల్లో మున్సిపల్, మండల, గ్రామాల పరిధిలో గ్రామ పంచాయతీతో పాటు విద్యాశాఖ అనుమతి పొందాల్సి ఉంది. కానీ ఇవేమి లేకుండానే ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వ్యాపారం కొనసాగిస్తూ రూ. కోట్లు దోచుకుంటున్నాయి.

రూ.150 కోట్ల వ్యాపారం..

ప్రైవేటు స్కూళ్లు సైడ్ బిజినెస్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి. అక్కడ విద్యార్థులకు అంటగడుతున్న పుస్తకాలు, వస్తువులు బయటి మార్కెట్‌లో సగం కంటే తక్కువ ధరకే లభిస్తాయి. మార్కెట్ విలువ కన్నా అధికంగా వసూలు చేసి దోచుకుంటున్న యాజమాన్యాలను అడిగేవారు లేక పోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఆయా పుస్తకాల, ఇతర వస్తువులు సరఫరా చేసే ఏజెన్సీల నుంచి 50 నుంచి 60 శాతం వరకు కమీషన్లు పొందడం కోసమే ఈ తరహా వ్యాపారానికి తెరతీశాయి.





విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన యూనిఫాంలు, షూ, సాక్సులు

ప్రస్తుతం నర్సరీ విద్యార్థికి పుస్తకాలు, దుస్తులు, షూలు, పెన్సిళ్లు తదితర వాటికి అయ్యే ఖర్చు రూ.4,500, అదే 1 నుంచి 5వ తరగతి పిల్లలకు అయ్యే ఖర్చు రూ.6 వేల నుంచి రూ.10,000 వరకు అవుతుంది. తరగతుల సంఖ్యతో పాటు ఈ ఖర్చు పెరుగుతుంది. గత విద్యా సంవత్సరం జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థుల సంఖ్య సుమారు 2.80 లక్షలు ఉండగా ప్రస్తుతం సుమారు 3 లక్షల పైమాటే. ఒక్కో విద్యార్థికి కనీసం రూ. 6 వేల లెక్కన లెక్కకట్టినా విద్యార్థులకు అవసరమైన వస్తువుల విక్రయ వ్యాపారం రూ. 150 కోట్లు అవుతుంది.

ఫ్యాన్సీ స్టోరుగా మార్చేశా



ఆళ్లగడ్డలో ఒకప్పుడు శ్రీనివాస (హోల్ సేల్) బుక్‌స్టోర్ అంటే చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంతో పేరు ఉండేది. మా దగ్గర కోవెలకుంట్ల, బనగానపల్లెతో పాటు నంద్యాల బుక్ స్టోర్స్ వారు కూడా వారికి అవసరమైన పుస్తకాలు, బోధన, ఇతర సామగ్రి తీసుకెళ్లే వారు. ఇప్పుడు ప్రతి ప్రైవేటు పాఠశాలలో బుక్‌స్టోర్ ఏర్పాటు చేసుకోవడంతో వ్యాపారం లేదు. బుక్స్ అండ్ ఫ్యాన్సీ స్టోర్ అని బోర్డు పెట్టుకున్నప్పటికీ ఒక్క పుస్తకం కూడా అమ్ముడు పోవడం లేదు. – సంజీవ, ఆళ్లగడ్డ

దోపిడీ జరుగుతున్నా పట్టించుకోరు



జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చేశాయి. ఇప్పుడు స్కూల్ ఫీజుతో పాటు పుస్తకాలు, ఇతర వస్తువుల పేరుతో దోచేస్తున్నాయి. నిర్వాహకులు అన్ని వస్తువులను బయటి మార్కెట్ కంటే అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా విద్యాశాఖాధికారులు వాటివైపు కన్నెత్తి చూడటం లేదు. విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడుతున్నా పట్టించుకోవడం లేదు. – వెంకట్, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు

ఏవీ విక్రయించరాదు



ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్మడానికి వీలులేదు. పాఠ్య పుస్తకాలు, తదితర వస్తువులు అధిక ధరలకు అమ్మడం నిబంధనలకు విరుద్ధం. ఫీజుల విషయంలో జీవోలకు అనుగుణంగా వ్యవహరించాల్సిందే. పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్మడానికి వీలులేదు. అలాంటివి మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. – సుధాకర్‌రెడ్డి – డీఈఓ



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి క్యూలైన్ల వద్దకు చేరుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజాము నుంచే భక్తులను మల్లన్న దర్శనానికి అనుమతించారు. భక్తులకు కంపార్ట్‌మెంట్లలో, క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన అధికారులు పర్యవేక్షణ చేపట్టారు. ఉచిత దర్శనానికి 4 గంటల సమయం, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భక్తుల శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

వణుకుతున్న చాబోలు

- అతిసారం బారిన మరో ముగ్గురు
- బాధితులను నందికొట్కూరు సీహెచ్‌సీకి తరలింపు

జూపాడుబంగ్లా: చాబోలు గ్రామాన్ని అతిసార వ్యాధి వణికిస్తోంది. నాలుగు రోజులుగా కేసులు నమోదవుతుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం ఆరేళ్ల చిన్నారి లావణ్యతో పాటు మరో ఇద్దరు అతిసారం బారిన పడటంతో వారిని 108లో నందికొట్కూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు. గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతున్నా సరైన సౌకర్యాలు లేక పోవడంతో బాధితులను వెంటనే నందికొట్కూరుకు తరలిస్తున్నారు. ఆరోగ్య, ఆశా వర్కర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల ఆరోగ్యస్థితిని తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం బాధితుల సంఖ్య 38కి చేరింది. వారిలో కొంత మంది కోలుకున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. మిగిలిన వారు నందికొట్కూరు, కర్నూలు ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నట్లు తెలిపారు. గ్రామంలో అతిసారం వ్యాధి వ్యాపించి నాలుగు రోజులైనా వ్యాధి వ్యాప్తికి గల కారణాలను తేల్చడంలో అధికారులు విఫలమయ్యారని గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్

పోతులపాడు మజరా గ్రామమైన చాబోలులో అతిసారం వ్యాధి ప్రబలి నడిపినాగన్న అనే వ్యక్తి మృతికి బాధ్యులను చేస్తూ 80 బన్నూరు పంచాయతీ కార్యదర్శి సామేలు, పోతులపాడు పంచాయతీ కార్యదర్శి మంజులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జూపాడుబంగ్లా ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ నూర్జహాన్ పంచాయతీ కార్యదర్శులకు సస్పెండ్ నోటీసులు అందజేసినట్లు తెలిపారు. ఆర్డీఓ దాసు నివేదిక మేరకు కలెక్టర్ చర్యలు చేపట్టారు.

డయేరియా నివారణకు పకడ్బందీ చర్యలు

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల: జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులుతో కలిసి మంత్రి బీసీ ఆదివారం వైద్య ఆరోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ జిల్లాలో అతిసార కేసుల వ్యాప్తిని అరికట్టేందుకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లు చేపట్టాలన్నారు. కమ్యూనికేషన్ స్ట్రాటజీ/మానిటరింగ్ మెకానిజం ద్వారా సూక్ష్మ ప్రణాళికలు రూపొందించి నివారణకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చేనెల 1 నుంచి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. వివిధ డ్రైన్ల మీదుగా వెళ్లే తాగునీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, ఓహెచ్ఎస్ఆర్‌లను కూడా పూర్తిగా తనిఖీ చేసి లీకేజీలను నియంత్రించాలని చెప్పారు. తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను వారానికోసారి శుభ్రం చేసి క్లోరినేట్ చేసిన నీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలం చాబోలులో అతిసారను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీటి సరఫరా విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోతులపాడు పంచాయతీ సెక్రటరీ మంజుల, బన్నూరు గ్రామ పంచాయతీ సెక్రటరీ సామేలును సస్పెండ్ చేయడంతో పాటు సంబంధిత ఈఓఆర్డీకి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. గ్రామంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిందిగా పంచాయతీ అధికారులను ఆదేశించామన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డీపీఓ మంజుల, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, మున్సిపల్ కమిషన్లు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

అనగనగా అంకాళమ్మ కోట

- నాడు దివిటి దొంగల స్థావరం
- నేడు గుప్తనిధుల దొంగల అన్వేషణ నిలయం
- పర్యావరణ పర్యాటకానికి అనువైన ప్రాంతం
- కృష్ణాతీరంలో ట్రెక్కింగ్‌కు, రిసార్ట్ ఏర్పాటుకు అవకాశం



కొండపై నుంచి కనిపించే చీమలతిప్ప సుందర దృశ్యం

ఆత్మకూరురూరల్: నల్లమల పర్వత సానువుల్ని చీల్చుకుంటూ కృష్ణా నదీ ప్రవాహం శ్రీశైలం వైపు సాగిపోతూ ఒక పెద్ద నదీలోయను అక్కడ సృష్టించింది. అలా సహజసిద్ధంగా ఏర్పడ్డ పర్వతం అంచున నిర్మాణమైనదే ఈ అంకాళమ్మ కోట. నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు అటవీ డివిజన్‌లో ఉండే పెద్ద గుమ్మడాపురం గ్రామం వద్ద ప్రారంభమయ్యే నల్లమల అటవీ ప్రాంతంలో ఈ పురాతన కోటకు అరుదైన చరిత్ర ఉంది. చరిత్ర పుటల్లోకి వెళితే భారతదేశంలో ధగ్గులు, పిండారీలు వంటి బందిపోటు దొంగల ముఠాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి కోవకు చెందిన వారే దివిటీ దొంగలు. ఎక్కడో అడవుల్లో తమ రహస్య స్థావరాలను ఏర్పాటు చేసుకుని ఎంచుకున్న గ్రామాలపై దాడులు చేయడం దివిటి దొంగల పని. నాడు దివిటీ దొంగలు ఏర్పాటు చేసుకున్న రహస్య స్థావరమై అంకాళమ్మ కోట అని పెద్దలు చెబుతూ ఉండడంతో అది అనాదిగా ఇప్పటికీ ప్రచారంలో ఉంది. ఎత్తైన నల్లమల కొండలపైన ఒకవైపు లోతైన లోయ, అందులో ప్రవహించే కృష్ణానది. మూడు వైపులా దట్టమైన అడవి ఉండడంతో ఈ కోట నిర్మాణం అత్యంత పటిష్టత, భద్రతకు ఆలవాలమైంది. దివిటి దొంగలు తాము కొల్లగొట్టిన ధన రాశులను దాచుకునేందుకు ఈ కోట అనువుగా ఉండింది. ఈ కోటలో అంకాళ పరమేశ్వరి ఆలయం ఉండటంతో ఆమె పేరుననే ఈ కోటకు అంకాళమ్మ కోట అని పేరు వచ్చింది.

గుప్తనిధుల వేటగాళ్లతో విధ్వంసం

అంకాళమ్మ కోట దివిటి దొంగల స్థావరంగా చరిత్ర చెబుతుండడంతో అక్కడ నిధులు పాతి పెట్టబడి ఉంటాయన్న ఆపోహలతో పలువురు ఈ కోటలో అక్రమంగా తవ్వకాలు జరిపి కోట యావత్తు గుంతల మయం చేశారు. విశాలమైన కోట ప్రాకారంతో విశిష్టంగా ఉండే ఈ కోట ఇప్పుడు కేవలం ఆనవాళ్లతో చరిత్రను గుర్తు చేస్తోంది. ఇందులో ఉన్న అంకాళమ్మ అమ్మవారి ఆలయం శిథిలమవడంతో పాటు గుప్తనిధుల వేటగాళ్ల తవ్వకాలకు కూలిపోయింది. అయితే కృష్ణా నదిలో చేపల వేటకు వలస వచ్చిన వైజాగ్ జాలర్లు తమ స్వయం కృషితో ఈ దేవాలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. అటవీ శాఖ పలుమార్లు అంకాళమ్మ కోటలో తవ్వకాలకు వచ్చే వారిని అరెస్టు చేసి కేసులు కూడా పెట్టింది.

అందాల నిలయం చీమల తిప్ప

అంకాళమ్మ కోట నుంచి లోయలో పారే కృష్ణమ్మను దర్శించడం ఒక అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది. విశాలమైన లోయలో ప్రవహించే నదీ గర్భంలో సహజంగా వెలసిన ద్వీప శిఖరమే చీమల తిప్ప. ఈ కొండపై విశాఖ జాలర్లు స్థిర నివాసమేర్పరుచుకుని నదిలో వేటకు వెళతుంటారు. కొండపై నుంచి చీమల తిప్ప అత్యంత సుందరంగా కనిపిస్తుంది. సిద్దేశ్వరం – సోమశిల మధ్యలో కృష్ణమ్మ ప్రవాహం వెంట నదీలోయలో ప్రయాణిస్తే ఎంతో అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు కనువిందు చేస్తాయి. ఈ ప్రయాణం పూర్తిగా భారత దేశంలోనే విస్తీర్ణంలో అతి పెద్దదైన శ్రీశైలం – నాగార్జున సాగర్ పెద్దపులుల అభయారణ్యం గుండా సాగుతుంది. శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణం కాకమునుపు ఈ నదీలోయలో సారవంతమైన సాగుభూమి ఎంతో ఉండేది. ఆ భూమిని ఆధారంగా అనేక గ్రామాలు నల్లమల అటవీ ప్రాంతం అంచులో కృష్ణా నది ఒడ్డున ఉండేవి. బలపాల తిప్ప, మారుగుత్తి, జానాల, సిద్దేశ్వరం గ్రామాలు శ్రీశైలం వెనుకతట్టు జలాల్లో మునకకు గురయ్యాయి. బలపాలతిప్ప, మారుగుత్తి గ్రామాలు పూర్తిగా అదృశ్యం కాగా, సిద్దేశ్వరం, జానాల గ్రామాల్లో స్వల్ప సంఖ్యలో ప్రజలు ఉన్నారు.



అంకాళమ్మ కోటలో ఆంజనేయస్వామి గుడి





అవశేషంగా మిగిలిన కోట ప్రాకారం



రేగడగూడూరులోని పురాతన బురుజు

దొంగల రాకను పసిగట్టేందుకు బురుజులు

దుర్గమారణ్యాలైన నల్లమల నుంచి రాత్రి వేళ దివిటి ధరించి గుర్రాలపై వేగంగా వస్తూ గ్రామాలపై పడే దివిటి దొంగలంటే ప్రజలు వణికిపోయేవారు. వారి వల్ల ఎంతో ధన, ప్రాణ నష్టం కూడా కలిగేది. కాలక్రమేణ దివిటి దొంగల రాకను తెలుసుకునేందుకు స్వీయ రక్షణకు, నల్లమల అడవుల అంచుల్లో ఉన్న పలు గ్రామాల ప్రజలు తమ ఏర్పాట్లు వారు చేసుకున్నారు. ప్రతి గ్రామంలో ఎత్తైన రక్షణ బురుజులను కట్టించుకున్నారు. వాటిపై వంతుల వారీగా నిత్య పహారా కాస్తు దూరం నుంచే దివిటి దొంగల రాకను పసి గట్టి గ్రామస్తులను హెచ్చరించేవారు. జిల్లాలోని కొత్తపల్లె మండలంలోని శివపురం, దుద్యాల, ముసలిమడుగు, వెలుగోడు మండలంలోని వేల్పనూరు, రేగడగూడూరులలో ఇప్పటికీ అలాంటి బురుజు నిర్మాణాలు కనిపిస్తాయి.

పర్యాటకానికి అనువైన ప్రాంతం

అంకాలమ్మ కోటను ఒక పర్యాటక కేంద్రంగా వినియోగించుకునేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. పురాతనమైన కోట సందర్శనకు పలువురు ఉత్సాహం చూపుతారు. చీమల తిప్పపై ఎకో – టూరిజంలో భాగంగా రిసార్ట్ ఏర్పాటు చేయవచ్చు. అక్కడ నుంచి అంకాళమ్మ కోటకు ట్రెక్కింగ్, నదిలో బోటింగ్‌కు అవకాశాలున్నాయి. అలాగే నది వెంట శ్రీశైలం అభిముఖంగా ప్రయాణిస్తే నదికి ఇరువైపులా నల్లమల అడవి అత్యంత అద్భుతంగా కనువిందు చేస్తుంది.

ఇలా చేరుకోవచ్చు..

సరిగ్గా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా ఉన్న కృష్ణా నదికి కుడిగట్టు అయిన ఆంధ్రప్రదేశ్‌లోని కొత్తపల్లె మండలంలోని పెద్ద గుమ్మడాపురం గ్రామ సరిహద్దుల్లో అంకాళమ్మ కోట ఉంది.తెలంగాణా వైపునుంచి రావాలంటే సోమశిల నుంచి టూరిజం బోటులో ఆరు కి.మీ. ప్రయాణిస్తే చీమల తిప్ప కనిపిస్తుంది. అక్కడ నుంచి ట్రెక్కింగ్ ద్వారా కొండ ఎక్కి అంకాళమ్మ కోట చేరుకోవచ్చు. అలాగే తెలంగాణ వైపు ఉన్న అమరగిరి నుంచి కూడా 12 కి.మీ. నదిలో ప్రయాణించి చీమల తిప్ప చేరుకోవచ్చు. కర్నూలు వైపు నుంచి వచ్చే వారు. కొత్తపల్లె మండలంలోని పెద్ద గుమ్మడాపురం వరకు రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించవచ్చు. అక్కడ నుంచి అడవిలో ప్రయాణించేందుకు నాగార్జునసాగర్ – శ్రీశైలం పులుల అభయారణ్యం ఆత్మకూరు డిప్యూటి డైరెక్టర్ అనుమతి తీసుకోవాలి.

నేలతల్లికి నవధాన్యాల హారం

- జిల్లా వ్యాప్తంగా 224 గ్రామాల్లో నవధాన్యాల సాగుకు శ్రీకారం
- ప్రధాన పంటలకు ముందు పచ్చిరొట్టిగా సాగు
- భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాల పెంపునకు చర్యలు
- ఇప్పటికే రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ

ఏటా పంటలు సాగు చేసి పుడమి తల్లి నుంచి లాభాలు గడించటమే కానీ, భూసార పరిరక్షణకు రైతన్నలు తీసుకునే శ్రద్ధ అంతంత మాత్రమే. అధిక దిగుబడులే లక్ష్యంగా ఏటా ఒకే రకమైన పంట సాగు చేయడం, విచ్చలవిడిగా రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకంతో భూసారం తగ్గి భూమి నిస్సారమవుతోంది. ఫలితంగా పంట దిగుబడులు తగ్గడంతో పాటు భూమి పంటల సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన ప్రభుత్వం నేలతల్లి మెడలో పోషకాల హారం వేసేందుకు శ్రీకారం చుట్టింది.




పాణ్యం వద్ద జీలుగలో సాగు చేసిన కూరగాయలు, చాగలమర్రి మండలం ముత్యాలపాడు వద్ద నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న జిల్లా మేనేజరు నరేంద్రకుమార్‌రెడ్డి బృందం

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్ పంటల సాగు ముందు నవధాన్యాల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించి పుడమికి ఆరోగ్య రక్ష కట్టేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 224 గ్రామాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 78,239 ఎకరాల్లో వరి, పసుపు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, శనగ, పత్తి, ఉల్లితో పాటు పలు రకాల పంటలను సాగు చేయనున్నారు. ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాల పంటలను సాగు చేస్తే భూమికి అవసరమయ్యే పోషకాలు పెరిగే అవకాశం ఉండటంతో ఈ పద్ధతిపై ప్రకృతి వ్యవసాయ విభాగం దృష్టి సారించింది. దీంతో వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం పరిధిలో జిల్లాలో 123 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 224 గ్రామాల్లో, 400 పైచిలుకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు వివిధ పంటల సాగులో రసాయన ఎరువులను సిఫారసు మోతాదుకంటే అధికంగా వాడటం వల్ల భూసారం కోల్పోయి క్రమేపి పంట దిగుబడి శాతం తగ్గిపోతోంది. దీనికితోడు ఒకే పంటను సాగు చేస్తుండటంతో పొలాల్లో పోషకాలు అసమతుల్యత ఏర్పడింది. ఇటువంటి తరుణంలో నవధాన్యాల పంటలు సాగు భూసారాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషించనున్నాయి. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇప్పటికే నవధాన్యాల పంటల సాగును రైతన్నలు ప్రారంభించారు. 123 రైతుభరోసా కేంద్రాల పరిధిలోని 224 గ్రామ పంచాయతీల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి 51,220 మంది రైతులతో 78,239 ఎకరాల్లో (ప్రీమాన్‌సూన్ డ్రై సూయింగ్) నవధాన్య పంటల సాగు లక్ష్యంగా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 32,312 నవధాన్య కిట్లను సిద్ధం చేయగా వాటిలో 30,602 కిట్లను 25452 మంది రైతులకు పంపిణీ చేశారు. వీరంతా 28,758 ఎకరాల్లో నవధాన్య పంటలను సాగు చేశారు.

ప్రధాన పంటల సాగుకు ముందు..

ప్రధాన పంటల సాగుకు ముందే నవధాన్యాల పంటల సాగు చేయడంతో భూమికి కావాల్సిన పోషకాలు అధికంగా లభ్యమవుతాయి. దాదాపు 30 రకాల విత్తనాలను కలిపి ఒక్కో కిట్టు 13 కిలోల చొప్పున సిద్ధం చేసి రైతులకు అందించారు. వీటిని రైతులు సాగు చేసి పొలంలో కలియదున్నే విధానంలో జీలుగ, జనుము, అలసంద, మినుము వంటి వాటిని నీటి వసతి ఉంటే దున్నేస్తే కుళ్లిపోయి భూమిలో కలిసిపోతాయి. మరి కొన్ని రకాలు పంటల సాగులో పైరు రెండు నెలల దశకు చేరుకున్న అనంతరం పైరును కోసి పశువులకు మేతగా వాడుకుని మిగిలిన వేళ్లను కలియదున్నడం వల్ల పోషకాలు పెరుగుతాయి.

- ధాన్యజాతికి సంబంధించి మొక్కజొన్నలు కిలో, జొన్నలు, గోధుమలు అరకిలో, పప్పుధాన్య పంటలైన కందులు 900 గ్రాములు, పెసలు, ఉలవలు 600 గ్రాములు, అలసంద, బొబ్బర్లు కిలో, శనగలు అరకిలో, అనప కిలో, మినుము 600 గ్రాములు సాగు చేయాలి.
- చిరుధాన్యాలకు సంబంధించి కొర్రలు 250 గ్రాములు, రాగులు 250 గ్రాములు, అరికెలు, వరిగలు, సామలు, అండు కొర్రలు, ఊదలు 250 గ్రాములు, సజ్జలు కిలో సాగు చేయాలి.
- నూనెజాతి రకాలైన నువ్వులు, వేరుశనగలు 500 గ్రాములు, ఆవాలు 500 గ్రాములు, పొద్దుతిరుగుడు 150 గ్రాములు, ఆముదం, ఓలుసులు, కుసుమలు 300 గ్రాములు సాగు చేయాలి.
- పచ్చిరొట్టి ఎరువులకు సంబంధించి జీలుగలు, కట్టెజనుము 150 గ్రాములు, పిల్లపెసలు, అవిసలు 150 గ్రాములు సాగు చేయాలి.
- పుష్పజాతికి సంబంధించి బంతి 0.03 గ్రాములు, కూరగాయలకు సంబంధించి బెండ, గోరుచిక్కుడు అరకిలో, వంకాయ, టమాటాలు 0.01 గ్రాములు సాగు చేయాలి.
- ఆకుకూరలకు సంబంధించి తోటకూర, పాలకూర, చుక్కాకు, గోంగూర 250 గ్రాములు, తీగజాతి రకాలకు సంబంధించి అనప, సొర, బీర, కాకర, బీన్స్, దోసకాయలు 0.01 గ్రాములు, పుచ్చ, కర్బూజ, చిక్కుడు, పొట్ల కాయలను సాగు చేయాలి.
- సుగంధ ద్రవ్యాలకు సంబంధించి ధనియాలు, మెంతులు, మిరపలను 5 గ్రాములు, గడ్డిజాతికి సంబంధించి ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్‌ను 500 గ్రాములతో సాగు చేసుకోవాలి.

ప్రయోజనాలు ఇలా..

- భూమిలో పోషకాలు లభ్యమవుతాయి.
- సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది.
- ఏడాది పొడవునా భూమిలో పైరు ఉంటుంది. నేల చీలిపోకుండా ఉంటుంది.
- నవధాన్యాల సాగుతో వేళ్ల మధ్య సంపర్కం పెరిగి మొక్కకు కావాల్సిన పోషకాలు తయారవుతాయి.
- నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుంది.
- ప్రధాన పంట సాగులో చీడపీడలు ఆశించవు.
- జీవనవైవిధ్యంలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఉత్పత్తి అవుతాయి.
- నవధాన్య పంటలను పొలంలో కలియదున్నడం వల్ల బాగా చితికి సేంద్రియ పదార్థంగా మారుతుంది.
- నేల భౌతిక లక్షణాల్లో మార్పు జరిగి వేరు వ్యవస్థ ధృడపడి గాలి, నీరు సులభంగా గ్రహించడానికి వీలవుతుంది.



పంపిణీకి సిద్ధంగా ఉన్న కిట్లు

జిల్లాలో 2024-25 నవధాన్య సాగు లక్ష్యం ఇలా..	
ఎంపిక చేసిన గ్రామాలు:	224
ఎంపిక చేసిన రైతులు:	51,220
సాగు విస్తీర్ణం లక్ష్యం (ఎకరాల్లో):	78,239
రైతులకు పంపిణీ చేసిన విత్తన కిట్లు:	30,602
ఇప్పటివరకు సాగు చేసిన రైతులు:	25,452
ఇప్పటి వరకు సాగైన విస్తీర్ణం (ఎకరాల్లో):	28,758

పొలం బెట్ట పోకుండా



నేను ఎకరా పొలంలో నవధాన్య పంటలను సాగు చేశాను. ఈ నవధాన్య పంటల సాగుతో పొలమంతా పచ్చగా ఉంది. దీంతో భూమి బెట్ట పోకుండా ఉంటుంది. అలాగే భూమిలో కర్బన సమ్మేళనం పెరిగి భూమిలో తేమ అలాగే ఉంటుంది. త్వరలో నవధాన్య పంటలను భూమిలో కలియదున్నుతాను. దీంతో భూమి సారవంతంగా ఉంటుంది.

– టీ.నరేష్, రైతు, ముత్యాలపాడు, చాగలమర్రి మండలం

లక్ష్యసాధనకు కృషి

జిల్లాలో ఈ ఏడాది లక్ష్యం మేరకు నవధాన్యాల సాగు చేయిస్తాం. ఈ ఏడాది లక్ష్యంలో ఇప్పటి వరకు 25,452 మంది రైతులకు సంబంధించి 30,602 ఎకరాల్లో నవధాన్యాల పంట సాగు చేశారు. ఈ నవధాన్యాల సాగు వల్ల భూమిలో పోషక విలువలు, భూసారం పెరుగుతాయి.

– నరేంద్ర కుమార్ రెడ్డి, జిల్లా మేనేజరు, ప్రకృతి వ్యవసాయ విభాగం

క్లుప్తంగా

హరికిషన్‌కు తెలుగు బంధు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న హరికిషన్

కర్నూలు కల్చరల్: ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్‌కు తెలుగు బంధు పురస్కారం ప్రదానం చేశారు. తెలుగు అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో హైదరాబాదు రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త కొలకలూరి ఇనాక్, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్, తెలుగు అభివృద్ధి సమితి అధ్యక్షులు మేక రవీంద్ర చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. డాక్టర్ హరికిషన్ సామాజిక సమస్యలపై వివిధ కథలను రచించడమే కాకుండా బాలల కోసం 50కి పైగా పుస్తకాలు ప్రచురించారు. జానపద బాలసాహిత్యాన్ని పరిరక్షించడం కోసం 15 సంవత్సరాలుగా కృషి చేస్తూ 17 పుస్తకాలు వెలువరించారు. అవార్డును అందుకున్న హరికిషన్‌కు పలువురు సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

ఔషధ నియంత్రణ శాఖ ఏడీపై సస్పెన్షన్ ఎత్తివేత

కర్నూలు(హాస్పిటల్): ఔషధ నియంత్రణ శాఖ ఏడీ ఏటీవీ రమాదేవిపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. గత నెలలో పోలింగ్ సందర్భంగా విధి నిర్వహణ సరిగ్గా చేయలేదన్న కారణంతో అప్పట్లో ఆమెను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన సిఫారసు మేరకు ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కొల్లి రఘురామ్‌రెడ్డి సస్పెండ్ చేశారు. ఆమెతో పాటు జిల్లాలో దాదాపు వందకు పైగా ఉద్యోగులు అప్పట్లో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఉద్యోగుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నాయకుల విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ తాజాగా సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. ఈ మేరకు ఔషధ నియంత్రణ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఏడీకీ తాజాగా ఉత్తర్వులు అందాయి.

కల్లూరు ఎస్టేట్‌లో చోరీ

కర్నూలు : కల్లూరు ఎస్టేట్‌లోని ఉమామహేశ్వర రావు నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ మాలిక్ బాషా ఇంట్లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఈయన గౌండా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు పట్టపగలే తాళం పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 16 తులాల బంగారం, 50 తులాల వెండి, 50 వేల నగదు మూట కట్టుకొని ఉడాయించారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలోని సామాన్లన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకొని నాలుగవ పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. నేరం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగలు పట్టుకునేందుకు ఆధారాలను సేకరిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆదోని–ఇస్వి రైల్వే స్టేషన్‌ల మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుని మృతిచెందినట్లు రైల్వే ఎస్‌ఐ గోపాల్ ఆదివారం విలేకరులకు తెలిపారు. మృతుడు టీషర్ట్, బ్లూ కలర్ జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9849157634 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయి కార్యాలయాలను తరలించొద్దు



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

కర్నూలు సిటీ: జిల్లాలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యాలయాలు తరలించకుండా ఇక్కడే కొనసాగించాలని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి కోరారు. ఆదివారం కర్నూలులో రాయలసీమలోని నాలుగు జిల్లాల ఉద్యమ నాయకుల సమావేశం ఆ సమితి జిల్లా కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సాగు నీటి ప్రాజెక్టులపై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ జూలై మొదటి వారంలో సీఎం, జల వనరుల శాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారులను కలిసి రాయలసీమ సాగు నీటి ప్రాజెక్టుల స్థితిగతులపై సమగ్ర నివేదికను సమర్పించనున్నామన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 854 అడుగులు ఉండేలాగా కృష్ణానది యాజమాన్య బోర్డు రూపొందించిన రూల్ కర్వ్‌ను అమలు పరచాలన్నారు. విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సీమలోని పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. విభజన చట్టంలోని ఉన్న దుమ్ముగూడెం నాగార్జున సాగర్ టైల్‌పాండ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. కేఆర్ఎంబీ బోర్డు కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని, చెరువుల అభివృద్ధి కోసం ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, సిద్దేశ్వరం అలుగు నిర్మించాలని కోరారు. సమావేశంలో ఆ సమితి నాయకులు వాడాల చంద్రశేఖర్ రెడ్డి, డేవిడ్, శ్రీనివాసులు, రామ్‌కుమార్, వెంకటేష్, రత్నం ఏసేపు, రాహూల్, సుంకన్న, ప్రతాప్ రెడ్డి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరుడిని సమీపిస్తున్న కృష్ణమ్మ



సంగమేశ్వరం ముఖమండప మెట్లవద్ద పెరుగుతున్న కృష్ణాజలాలు

కొత్తపల్లి: ప్రాచీన పవిత్ర పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయాన్ని కృష్ణాజలాలు సమీపిస్తున్నాయి. కృష్ణా జలాలు ఆలయం ముఖ మండపం భాగంలోని మెట్ల ప్రాంతాన్ని తాకాయి. రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుండడంతో జలకళ సంతరించుకుంటుంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 885 అడుగులు కాగా ఆదివారం రోజుకి అది కాస్త 815 అడుగులకు చేరుకుంది. మరో 25 అడుగుల మేరకు నీటిమట్టం పెరిగితే సంగమేశ్వరాలయంలోకి వరద నీరు వచ్చి చేరుతుంది.

బీసీలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయాలి



సంఘీభావం తెలుపుతున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): బీసీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే అమలు చేయాలని బీసీ నేతలు డిమాండ్ చేశారు. కర్నూలులోని బీసీ భవన్‌లో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి అధ్యక్షతన 'బీసీ హక్కుల సాధన' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ జేఏసీ కన్వీనర్లు బత్తుల లక్ష్మీకాంతయ్య, అయ్యన్నయాదవ్, జీ కృష్ణయ్య, బ్రహ్మయ్య ఆచారి హాజరయ్యారు. ముందుగా విశ్వబ్రాహ్మణ పితామహులు బ్రహ్మశ్రీ రావు సాహెబ్ పండిత గానాల రామమూర్తి 88వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బీసీ నేతలు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల కోసం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో గానాల రామమూర్తి ఎమ్మెల్సీగా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో బీసీలకు రక్షణ చట్టం అమలు చేస్తామని, 50 సంవత్సరాలు దాటిన బీసీలకు పింఛన్లు అందిస్తామని ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేయాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అగ్రస్థానం కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం శోచనీయన్నారు. సమావేశంలో నాయకులు టింగిరి సురేష్ ఆరేకటికె, కే రాజశేఖర్, యల్లయ్య ఆచారి, నాగేశ్వరాచారి, శ్రీరాములు, పుల్లయ్య ఆచారి, నాగలక్ష్మయ్య, సుధాకర్, దుర్గయ్య, సత్యనారాయణ, శివప్రసాద్, ప్రహ్లాదాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

మహానంది: డిగ్రీ చదివినా ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమ్మడపల్లె గ్రామానికి చెందిన మిద్దె ఆంజనేయులు(21) డిగ్రీ పూర్తి చేశాడు. అయితే ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి మిద్దె సాలన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మిద్దె సాలన్నకు ముగ్గురు కుమారులు కాగా ఆంజనేయులు మూడవ కుమారుడని కుటుంబ సభ్యులు తెలిపారు.

మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలి

- జీఓ నెంబరు 117ను రద్దు చేయాలి
- ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోకారి, టి.కె జనార్దన్, తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాం ఖాన్ భవనంలో ఎస్టీయూ జిల్లా కమిటీ ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. యువ గళం పేరుతో చేపట్టిన యాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వస్తే జీఓ నెంబరు 117ను రద్దు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారని, తక్షణమే ఆ జీఓను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు గతంలో మాదిరి 1నుంచి 5 తరగతులు ఒకే స్కూల్‌లో ఉండేటట్లు చూడాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలన్నారు. కోర్టు కేసులకు అస్కారం లేకుండా వీలైనంత త్వరగా మోగా డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పీఆర్సీ ఆలస్యం కానుండడంతో ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులను కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, అనవసరమైన యాప్‌లను రద్దు చేయాలన్నారు. కస్తూర్బా స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, మున్సిపల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు సి. నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాగరాజు, ఆర్థిక కమిటీ సభ్యులు బి.సుంకన్న, ఆయా మండలాల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

వేధిస్తున్నాడని భర్తను చంపేసింది

- కత్తెరతో పొడిచి హత్య చేసిన భార్య



మృతి చెందిన వెంకటేష్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఓ వ్యక్తిని భార్యనే కత్తెరతో పొడిచి హత్య చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటేష్ (35), మమత దంపతులు స్థానిక బుడగజంగాల కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. వెంకటేష్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గత కొంతకాలంగా అతను తన వృత్తిని మానేసి మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. దీంతో మమత కుటుంబాన్ని పోషించటం కష్టంగా మారడంతో తన సొంత బావతో కుటుంబ అవసరాలకు డబ్బు తీసుకునేది. ఈ విషయంలో వెంకటేష్ తరచూ భార్యతో ఘర్షణ పడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా ఘర్షణ పడగా మమత కత్తితో వెంకటేష్ వీపు భాగంలో గాయపరిచింది. ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్న వెంకటేష్ తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి మమతతో మళ్లీ ఘర్షణ పడ్డాడు. సహనం కోల్పోయిన మమత పక్కనే ఉన్న కత్తెరతో భర్త ఛాతిపై పొడిచింది. రక్తపుమడుగులో పడి ఉన్న వెంకటేష్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఛాతికి తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పెద్దనేలటూరులో నెమళ్లు

గోనెగండ్ల మండల పరిధిలోని పెద్ద నేలటూర్ గ్రామ శివార్లలో ఆదివారం ఉదయం నెమళ్లు సంచరించాయి. వాటిని ఎవఱష్ట ఏమీ అనకపోవడంతో కొద్ది సమయం సంచరించి మళ్లీ పొలాల వైపు వెళ్లిపోయాయి. – గోనెగండ్ల

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్
- ఘనంగా ఆర్యవైశ్య హాస్టల్ ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని నంద్యాల రోడ్డులో నిర్మించిన టీజీ లక్ష్మీవెంకటేష్ వాసవీ వైశ్య హాస్టల్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. అన్ని దానాల్లోకి విద్యాదానం గొప్పదని, ఎంతో మంది ఆర్యవైశ్య విద్యార్థులకు ఉపయోగపడే హాస్టల్‌ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రాంతంలో ఆర్యవైశ్యులను బానిసలుగా చూసేవారన్నారు. నేడు వారికి తగిన గౌరవం లభించిందన్నారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఆస్తులను కాజేసేందుకు పలువురు కుట్రలు చేస్తున్నారని, అలాంటి వారి నుంచి ఆస్తులను రక్షించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఆర్యవైశ్యులందరూ ఒక కుటుంబంలా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు దేవకీ వెంకటేశ్వర్లు, సిద్దా నాగేశ్వరరావు, పెనుగొండ సుబ్బరాయుడు, ఇల్లూరు లక్ష్మయ్య, టీజీ శివరాజు, అమరవాది లక్ష్మినారాయణ, కోటా సత్యనారాయణ, రజని, శబరి, వరప్రసాద్, రాయపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

7న కొలతల శిబిరం

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్, కర్నూలు తుంగ భద్ర, హంద్రీ శాఖల ఆధ్వర్యంలో ఉచితంగా కృత్రిమ అవయవాలు అందజేసేందుకు కర్నూలు బుధవారపేట కేశవ మెమోరియల్ పాఠశాలలో జూలై 7వ తేదీ ఉదయం 10 గంటలకు కొలతల శిబిరం నిర్వహిస్తున్నట్లు బీవీపీ కన్వీనర్ రేగూరు బాలకృష్ణ, అధ్యక్షులు అనుమలు లక్ష్మణ స్వామి, కార్యదర్శి బుస్సా శ్రీ నివాసులు తెలిపారు. ప్రమాదవ శాత్తూ కానీ, పోలి యో వల్ల కానీ కాళ్లు చేతులు పోగొట్టుకున్న దివ్యాంగులు ఉచిత కృత్రిమ అవయవాల కొలతలు ఇచ్చేందుకు శిబిరానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 81425 50143, 94914 16299 నంబర్లను సంప్రదించాలని సూచించారు.